క్లుప్తంగా

నేడు విద్యా సేవా పురస్కార అవార్డులు

సామర్లకోట: డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది నిర్వహిస్తున్న గురు పూజా మహోత్సవంలో భాగంగా ఉపాధ్యాయులుగా సేవలు చేసిన వ్యక్తులను గుర్తించి గురువారం విద్యా సేవా పురస్కారాలు అందిస్తున్నట్టు మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1983 నుంచి విద్యా బోధన చేస్తున్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులను గుర్తించి, అంబటి వారి వీధిలోని రాజయోగ శిక్షణ కేంద్రంలో పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

తాగునీరు కలుషితం



మున్సిపల్ కుళాయిల నుంచి 13వ వార్డులో సరఫరా అయిన తాగునీరు

సామర్లకోట: మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలసి ఉండగా కలుషిత తాగునీటిని సరఫరా చేస్తోందని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. బుధవారం మున్సిపల్ కుళాయిల నుంచి సరఫరా అయిన తాగునీరు పసరు రంగులో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తరచూ కలుషితమైన తాగునీరు మున్సిపల్ కుళాయిల నుంచి సరఫరా అవుతుందన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

కొత్తపల్లి: సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా అధికారులు, వలంటీర్లు కృషి చేయాలని డీఎల్‌పీఓ వసంత మాధవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షర ఆంధ్ర శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన వలంటీర్లు గ్రామ స్థాయిలో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ పసుపులేటి పోసయ్య, స్టాటిస్టికల్ అధికారి పోలిశెట్టి రాజేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణా సత్యరెడ్డి, ఉపాధిహామీ ఏపీఓ కొండలరావు పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి ఉత్సాహవంతులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెంట్ దాసరి నాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను కాకినాడ పోస్టల్ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447

ఎలకొట్టుడు..

- పంటకు మూషికాల బెడద
- అన్నదాతకు అధిక వ్యయం
- దిగుబడిపై ప్రభావం పడే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు

పెద్దాపురం: గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా ఉంది నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి. ఈ సార్వాలో రైతులకు అవసరమైన సమయంలో కాకుండా తర్వాత పడడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని చోట్ల నారుకొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. వరి చేలు ఇప్పుడుడిప్పుడే మొలకలు వచ్చి దుబ్బులు కడుతున్న సమయంలో ఎలుకల బెడద ఎక్కువైంది. మూషికాలు మొలకలను కొరివేస్తుండంతో వాటిని అదుపు చేసేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రసాయనిక మందులు వాడినా ఎలుకల నిర్మూలన సాధ్యం కాకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివారణా చర్యలు చేపడుతున్నా..

ఎలుకల నివారణకు వరి నూకల్లో తగిన మోతాదు రసాయనిక మందు కలిపి పొట్లాలు కట్టి పొలాల్లోని గట్లపై ఉండే ఎలక బొరియల్లో ఉంచుతున్నారు. ఎలుకల ఉధృతి అధికంగా ఉండడంతో ప్రస్తుతం ఈ విధానం ఫలితం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎలుకల నివారణకు బుట్టలు ఉపయోగించడం, పొగ పెట్టడం వంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినడానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చరిన వెదురు కర్రల మధ్య చిక్కుకుని మరణిస్తుంది. పొగపొట్టే పద్ధతిలో ఎలుకలు తిరగాడే ప్రాంతాన్ని గుర్తించి అక్కడ కొంత మేర తవ్వి, కుండలో గడ్డి ఉంచి, నిప్పు పెట్టి పొగవచ్చేలా చేసి కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. ఈ విధానం ద్వారా ఒక్కో ఎలుకకు రూ.60 చొప్పున తీసుకుంటారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎలుకలు పట్టే వారికి మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి రెండు, మూడు వేల రూపాయల వరకు ఎలుకలను పట్టేందుకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎలుకల నిర్మూలన పూర్తిగా సాధ్యం కావడవం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఇవి దిగుబడిపై ప్రభావం చూపుతాయని కలవరపడుతున్నారు.



ఎలుకల నిర్మూలనకు పొలంలో బుట్టలు ఏర్పాటు చేస్తున్న రైతు



ఎలుకలను పట్టేందుకు బుట్టలు సిద్ధం చేస్తున్న నిపుణుడు

పంట నాశనమవుతుంది



ఎలుకల దాడికి గురైతే వరి పంట పూర్తిగా సర్వనాశమవుతుంది. మార్కెట్లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినడం లేదు. ఎలుకలు వరి దుబ్బుల మొదలంతా కొరికిపారేయడంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాలు దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

– సుందరెడ్డి రాజు, కౌలురైతు,, పులిమేరు, పెద్దాపురం మండలం

దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



చిన్నారులకు భరతనాట్యం, కూచిపూడి శిక్షణ ప్రారంభించిన అరుణ

సామర్లకోట: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి రథం సెంటర్ వర్తక సంఘం ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని నాట్య గురువు జ్యోతి గణేష్ అన్నారు. స్థానిక నూకాలమ్మ ఆలయంలో 8 నుంచి 16 సంవత్సరాల బాలికలకు నిర్వహించే భరత నాట్యం, కూచిపూడి శిక్షణకు ఆలయ పారాయణ కమిటీ నాయకురాలు సత్తి అరుణ ప్రారంభించారు. చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్ అధినేత చిన్న, కిరణా షాపు యజమాని, నల్లబాబు, ఆటో మొబైల్ షాపు సత్తిబాబు, గ్రాండ్ పార్కులాడ్జి యజమాని, శుభలక్ష్మి క్లాత్ షాపు యజమాని శ్రీనివాసు, ఎలక్ట్రికల్ వెంకట్రావు, ఆటోమొబైల్ పేరపు వీరభాబు, పోలవరపు మణి, శేఖర్‌లు సహకారం అందించడానికి ముందుకు వచ్చారు.

ఎలుకల నివారణ మందు పంపిణీకి ఏర్పాట్లు



పిఠాపురంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ స్వాతి

పిఠాపురం: మండలంలోని 23 గ్రామాల్లో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఒకే రోజు వ్యవసాయ శాఖ ద్వారా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించినట్లు పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి తెలిపారు. బుధవారం పిఠాపురం మండలంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సామూహిక ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన బ్రోమోడయోలిన్ మందును ఎకరాకు 480 గ్రాములు నూకలు, 10 గ్రాముల మందు, 10 గ్రాములు నూనె కలిపి ఐదు నుంచి పది గ్రాముల పొట్లాలుగా తయారుచేసి రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ మందును తిన్న ఎలుకలు సాధారణంగా ఐదు నుంచి ఆరు రోజుల్లో చనిపోతాయని, ఈ మందు తిన్న ఎలుకలకు దాహం వేసి నీటి కోసం బయటకు వెళ్లి చనిపోవడం వలన మరణించిన ఎలుకలు చాలా వరకు కనిపించవని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా 85 కిలోల బ్రోమోడయోలిన్ ముందును ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం, పి.రాయవరంలో రైతులతో నిర్వహించిన సమావేశాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం వివరాలను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వైవీ గంగాధర్ మాట్లాడుతూ ఎలుక వలన పంటలకు కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోని రైతులు, ప్రజా ప్రతినిధులు రైతు సేవా కేంద్ర సిబ్బంది వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

కొత్తపల్లి: వరి పైరులో ఎలుకలు బెడద వలన పంటలో దిగుబడి తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు తెలిపారు. మండలంలోని సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకతిప్పలో రైతులకు ఎలుకల నివారణ మందును అందించారు. ఎలుకల మందు తయారీ, వాటి పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టరు రాహుల్‌మీనా బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం నూతన భవనంలోనికి రావడంతో భవనాన్ని పరిశీలించారు. కార్యాలయానికి చెందిన రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల గురించి తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కేస్టు సర్వే జరుగుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. కేస్టు సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగడానికి వీలులేదన్నారు. ఈ సర్వే సక్రమంగా పూర్తయితే సచివాలయంలో నిర్దేశించిన రుసుం చెల్లించి వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలను పొందడానికి వీలుంటుందని చెప్పారు. రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, పద్మాజారెడ్డి, సర్వేయర్ సతీ రామరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ ప్రవచనం



హనుమత్ ప్రవచనం నిర్వహిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

తుని రూరల్: బుద్ధిబలం, మనోబలం కలిగిన వ్యక్తి హనుమ ఒక్కరేనని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి తుని శివారు గెడ్ల బీడు సమీప సాయివేదికలో హనుమత్ వైభవం ప్రవచన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చాగంటి హనుమత్ వైభవాన్ని విశేషంగా చెప్పారు. హనుమ బుద్ధి, గొప్పతనాన్ని మొదట చెప్పింది సుగ్రీవుడు, జాంబవంతుడే అని అన్నారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదట రోజు రెండు గంటలపాటు ప్రవచనం నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది హాజరై ప్రవచనాన్ని విన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు సూచనలిస్తున్న విజయ్‌ప్రసాద్

గోకవరం: మండలంలో రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి రినీ ఆధ్వర్యంలో పామాయిల్, మామిడి, జీడిమామిడి రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సస్యరక్షణ అధికారి విజయ్‌ప్రసాద్ పాల్గొని మామిడి, జీడిమామిడి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య ఎరువులపై అవగాహన కల్పించారు. ప్రతి చెట్టుకు 250 గ్రాముల నత్రజని, 60 గ్రాముల పాస్ఫరం, 60 గ్రాముల పొటాషియం ఇచ్చే ఎరువులతో పాటు 50–100 కిలోల పశువుల ఎరువును వేసుకొని మట్టితో పోల్చాలని సూచించారు. ఇప్పుడున్న తోటలో అధిక సాంద్రత పద్ధతిలో ఎకరానికి 100, 150 చెట్లు తక్కువ దూరంలో వేసుకొని ప్రతి సంవత్సరం కొమ్మలు కత్తిరింపు చేపట్టడంతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పామాయిల్ పతంజలి కంపెనీ టెక్నికల్ ఆఫీసర్ కార్తీకరెడ్డి మాట్లాడుతూ, డ్రిప్ ద్వారా ఎరువులు అందిస్తే 25 శాతం ఖర్చు తగ్గించుకోవచ్చని, 10 శాతం అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు నిహారిక, సౌమ్య, సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

నర్సింగ్ నైపుణ్యంపై అవగాహన

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామం రాయుడుపాలెంలోని శారా నర్సింగ్ స్కూల్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యంపై ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) బుధవారం అవగాహన కల్పించింది. హైదరాబాద్‌లోని డాల్ఫిన్ టెక్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సింగ్ సెంటర్ ట్రైనింగ్ డైరెక్టర్ లక్ష్మీరావు విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యంపై అవగాహన కల్పించారు. దేశంలో కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు విదేశాలలో ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందేందుకు తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ అధ్యక్షత వహించగా శారా నర్సింగ్ స్కూల్ సిబ్బంది, ఏఐసీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలు తీర్చడంలో విఫలం

- వ్యవసాయాధికారులపై ఎంపీపీ ఆగ్రహం
- ఎంపీపీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశం
- స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో దరఖాస్తులు ఎందుకు?
- ఎంపీటీసీ ధ్వజం



ఎరువుల కొరతపై ఏఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: రైతుల అవసరాలను గుర్తించడంలో వ్యవసాయాధికారులు వైఫలమవుతున్నారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఆరోపించారు. బుధవారం సాయంత్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. వ్యవసాయశాఖాధికారి వి.మురళీధర్ శాఖకు సంబంధించిన రివ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట గింజలు పోసుకొనే దశకు వస్తే ఇప్పటి వరకు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఎందుకు అందలేని ఎంపీపీ ప్రశ్నించారు. మండలంలో పంటకు ఎరువులు వేయవలసిన సమయంలో అందకపోతే పంట పరిస్థితి ఏమిటని ధ్వజ మెత్తారు. రైతుల అవసరాలను గుర్తించి స్టాక్ ఏర్పాటు చేయాలన్నారు. ఆవిధంగా చేయకపోవడం వలన ఎరువులు వచ్చిన సమయంలో రైతులు పరుగులు తీస్తున్నారని మండిపడ్డారు. మండలంలో 23వేల ఎకరాలల్లో వరి సాగు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం రైతులకు మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా కావలసి ఉండగా 2,700 టన్నుల యూరియాను రైతులకు అందజేశామని ఏఓ తెలిపారు. మరో రెండు రేకులు మూడు రోజుల్లో వస్తాయని తెలిపారు. ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి అయ్యే సమయంలో సాంకేతిక లోపం కారణంగా జాప్యం జరిగిందన్నారు. మండలంలో 6,500 కౌలు రైతు కార్డులు ఇవ్వవలసి ఉండగా ఇప్పటి వరకు 1,500 కార్డులు జారీ చేశామని, ఈ నెలాఖరు నాటికి మిగిలిన కార్డులు అందజేస్తామని ఏఓ తెలిపారు. రైతులకు కావలసిన ఎరువులు, మందులు సకాలంలో అందే విధంగా చూడాలని నవర సొసైటీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల జారీ సమయంలో కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన దరఖాస్తును పూర్తి చేసి ఇవ్వాలని డీలర్లు డిమాండ్ చేయడం ఏమిటని వీకే రాయపురం ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ ప్రశ్నించారు. దీని కారణంగా దరఖాస్తుకు రూ.10, దానిని పూర్తి చేయడానికి రూ.30 ఖర్చు చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు ఇచ్చే సమయంలో ఎటువంటి రుసుం, దరఖాస్తు ఇవ్వవలసిన పని లేదన్నారు. అయితే కుల గణన సర్వే జరుగుతుందని, దాని కోసం దరఖాస్తుల స్వీకరించి ఉంటారని తహసీల్దార్ తెలిపారు. విద్యుత్ అదనపు లోడ్‌కు 50 శాతం రాయితీ డిసెంబర్ నెలాఖరు వరకు ఉందని, విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రవిచంద్ర తెలిపారు. మండలం 460 సోలార్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. సోలార్ విద్యుత్‌ను ట్రాన్స్ తీసుకున్న సమయంలో సంస్థ నుంచి సబ్సిడీ రావడం లేదని ఎంపీటీసీ శివరామ కృష్ణ ఆరోపించారు.

రేపు వాహనాల వేలం

ప్రత్తిపాడు: పట్టణ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 5న వేలం నిర్వహించనున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే పాటదారులు వేలం ప్రారంభానికి ముందు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు నకలు అందజేయాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న వ్యక్తి పాడిన సొమ్మును వెంటనే చెల్లించాలన్నారు. వాహనం దక్కించుకున్న వ్యక్తి 18 శాతం, 12 శాతం కానీ జీఎస్టీ సొమ్మును కూడా చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరంలో ఉన్న ప్రైవేట్ నర్సింగ్ కళాశాల వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. కళాశాలలో చదువుతున్న తమ పిల్లలను విజయవాడలోని బ్రాంచ్‌లో కోచింగ్ నిమిత్తం పంపించి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. తాము విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించలేదని, నర్సింగ్‌లో కోచింగ్ నిమిత్తం పంపించామని యాజమాన్యం తెలిపింది. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. యాజమాన్యం నచ్చజెప్పడంతో తల్లిదండ్రులు శాంతించారు.

పీఎమ్ కేర్ నిధి వడ్డీ అందజేత

గోకవరం: కరోనాలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలకు రూ.10 లక్షలు పీఎమ్‌కేర్ నిధులను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా వచ్చిన వడ్డీని సంబంధిత చిన్నారులకు ఇచ్చినట్లు కోరుకొండ సీడీపీవో సంజయ్‌రాణి బుధవారం తెలిపారు. గోకవరానికి చెందిన పెరవలి శశి, హెరిన్ తల్లిదండ్రులు 2021లో మృతి చెందగా.. ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పీఎమ్‌కేర్ నిధులను స్థానిక బ్యాంకులో జమ చేశారు. ఒక్కొక్కరికీ రూ.55 వేలుకి సంబంధించిన చెక్కును బ్యాంక్ మేనేజర్ సూర్య అనుదీప్ కుమార్‌కు అందజేశారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

అన్నవరం: మద్యం మత్తులో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడినట్లు ఎస్ఐ శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. పట్టణంలోని రిజర్వ్ చెరువు వద్ద మద్యం షాపు వద్ద మంగళవారం రాత్రి తమిళనాడుకు చెందిన మణికంఠ స్థానికుడైన రాము ఘర్షణ పడ్డారు. మణికంఠ బీరు సీసాతో రాముపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. రాముని ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ప్రాణాపాయం లేదని ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాలువలో దూకి యువతి మృతి

కిర్లంపూడి: ఏలేరు కాలువలోకి దూకి యువతి మృతి చెందిన ఘటనపై బుధవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భూపాలపట్నానికి చెందిన గుండె సీతయ్య, రమణి దంపతుల కుమార్తె సీత (19) కాకినాడలో నర్సింగ్ చదువుతుంది. ఇంట్లో గొడవపడి మంగళవారం రాత్రి బయటకు వెళ్లి రాకపోయే సరికి బుధవారం భూపాలపట్నంలోని ఏలేరు కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నిమజ్జనాలలో నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా శిబిరాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గణేష్ శిబిరాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. గణేష్ నిమజ్జన ఊరేగింపులో మద్యం సేవించిన వారిని దూరంగా ఉంచాలన్నారు. ఊరేగింపులో బాణసంచా కాల్పులను నిషేధించాలన్నారు. పిల్లలు, మహిళలు, నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న సమయంలో వారి సంరక్షణ బాధ్యత కమిటీ నిర్వాహకులే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీఐ ఎ.కృష్ణ భగవాన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గణపతి విగ్రహాల నిమజ్జనం పంచారామ క్షేత్రం ముఖద్వారం వద్ద ఉన్న రేవులో మాత్రమే నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల వివరాలను నిమజ్జన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బందికి తెలియజేయాల్సి ఉంటుందని సూచించారు. పెద్ద విగ్రహాలను క్రేన్ సహాయంతో మాత్రమే నిమజ్జనం చేయవలసి ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ అధికారులు సూచించిన విధంగా నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలన్నారు.

బీచ్‌రోడ్డులో వాహనాల దారి మళ్లింపు

కొత్తపల్లి: గణపతి నిమజ్జన కార్యక్రమంలో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తామని ఎస్సై వెంకటేష్ బుధవారం తెలిపారు. గురువారం, శనివారంలో అధికంగా వినాయక నిమజ్జనాలకు వాహనాలలో విగ్రహాలను తీరప్రాంతానికి తీసుకురావడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. కాకినాడ నుంచి వచ్చే వాహనాలను నేమాం వైపు, ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు పిఠాపురం వైపునకు మళ్లిస్తామని తెలిపారు. వాహన దారులు సహకరించాలని ఎస్సై కోరారు.

దక్షిణాయనంలో వేద శ్రవణం శ్రేయస్కరం



వేణుగోపాల ప్రచార సభలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత మార్ని జానకిరామ చౌదరి

బోట్‌క్లబ్: దక్షిణాయనంలో వచ్చే వర్ష రుతువులో సృష్టి ఆరంభమైందని, ఈ కాలంలో వేద పండితులకు ఆతిథ్యం ఇచ్చి సన్మానించి వారు ఆలపించే వేదాన్ని వినడం సకల శ్రేయోదాయకమని వేణుగోపాల ప్రచారసభ గౌరవ సలహాదారు, ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ సూచించారు. సంస్కృత ప్రచార సభలో గణపతి నవరాత్రుల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన దక్షిణాయన విశిష్టత వివరించారు. దక్షిణాయనంలో ఆధ్యాత్మికంగా జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే ఉత్తరాయణం పుణ్యకాలంగా అనుభవంలోకి వస్తుందన్నారు. ఆషాఢ, శ్రావణ, భాద్రపద ఆశ్వయుజ, కార్తిక, మార్గశిర మాసాల్లో ఏ విధంగా ఆచరణ ఉండాలో సనాతనం చెప్పిందని ఆయన వివరించారు. అమెరికా వంగూరి ఫౌండేషన్ చైర్మన్ చిట్టెన్ రాజు మాట్లాడుతూ ఎంతో ప్రాచీనమైన సంస్కృత ప్రచార సభ ఈశ్వర పుస్తక భాండాగారం ద్వారా సమాజానికి ఉపయోగపడే విలువైన కార్యక్రమాలు ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ప్రముఖ రచయిత మార్ని జానకిరామ చౌదరి మాట్లాడుతూ సంస్కృత ప్రచార సభ సంస్కృతిని సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రచార సభ ఉపాధ్యక్షుడు గంటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కిర్లంపూడిలో ఎరువుల దుకాణంలో స్టాక్ తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కిర్లంపూడి: నిబంధనలు అతిక్రమించి ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని కిర్లంపూడి, బూరుగుపూడి, సోమవరం, గెద్దనాపల్లి గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డుల నిర్వాహణ, గోడౌన్‌ల్లోని స్టాక్ వివరాలు పరిశీలించారు. గెద్దనాపల్లిలోని శ్రీసూర్య ఎంటర్ ప్రైజెస్ ఫెర్టిలైజర్ షాపు రికార్డుల్లో ఉన్న స్టాక్ కంటె సుమారు రూ.3 లక్షల విలువ చేసే మూడు రకాల ఎరువులు అనాధికారికంగా ఉన్నట్టు గుర్తించారు. షాపు యాజమానిపై 6ఏ కేసు నమోదు చేయనున్నట్టు తనిఖీ బృందం తెలిపారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఎరువులను ఎంఆర్పీ ధరల కన్నా ఎక్కువకు అమ్మినా, అనాధికారికంగా ఎరువులు ఉంచి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించిన డీలర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో తహసీల్దార్ విజయకుమార్, ఏఓ సుధామాధురి, సిబ్బంది పాల్గొన్నారు.